క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వింజమూరు(ఉదయగిరి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వింజమూరు సీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్ అన్నారు. వింజమూరు సీహెచ్‌సీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాదులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల ముప్పు నుంచి బయటపడొచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు.

ఏపీ ఎన్జీఓ సభ్యత్వ నమోదు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఎన్జీఓ సభ్యత్వ నమోదును గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీఓ వింజమూరు తాలూకా అధ్యక్షుడు వెలుగోటి మధు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీఎన్జీఓ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. నవంబరులో జరగనున్న వింజమూరు తాలూకా నూతన కార్యవర్గ ఎన్నికల కోసం వింజమూరు, కలిగిరి, కొండాపురం మండలాల్లో సభ్యత్వ నమోదు చేపడుతున్నామని తెలిపారు. అన్ని శాఖల ఉద్యోగులు సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారని వివరించారు.

పొదుపు మండల సమాఖ్య సమావేశం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల పొదుపు సమాఖ్య సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాలు, తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సంఘాల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ లావాదేవీలు సరిచూసుకోవాలన్నారు. పశువులు, కోళ్ల పెంపకంపై ఆసక్తి కలిగిన సంఘబంధాల సభ్యులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీఎం సుధాకర్ రావు, సీసీలు సునీత, సుశీల, లక్ష్మీకుమారి, విజయమ్మ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



ఉదయగిరి: స్థానిక శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా రెడ్‌క్రాస్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 76 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. బీజేపీ మండలాధ్యక్షురాలు విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు హరగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ రామ్మోహన్, వైద్యాధికారిణి ఏ శివకల్పన, పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ, నాయకులు నారాయణరెడ్డి, మాధవరెడ్డి, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

హైవేపై వెలిగిన దీపాలు



సాక్షి ఎఫెక్ట్..

దుత్తలూరు: దుత్తలూరు సెంటర్‌లో 167 బీజీ హైవేపై దీపాలను ఎట్టకేలకు వెలిగించారు. దుత్తలూరు సెంటర్‌లో హైవేపై దీపాలు వెలగక చీకటిపడితే అంధకారం నెలకొంటుండడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందుల పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల 'సాక్షి'లో 'హైవేపై వెలగని దీపాలు' శీర్షికన కథనం రావడంతో హైవే అధికారులు స్పందించారు. గురువారం 167-బీజీ హైవే ఫ్లైఓవర్‌తో పాటు సర్వీసు రోడ్లలోని దీపాలను వెలిగించారు. దీంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మరుగుదొడ్లను వినియోగించాలి

దగదర్తి: బహిరంగ మల విసర్జనతో వ్యాధులు వ్యాపిస్తాయని, ప్రతిఒక్కరూ మరుగుదొడ్లను తప్పనిసరిగా వినియోగించాలని అల్లూరు ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. బహిరంగ మల విసర్జన రహిత గ్రామాల పరిశీలనలో భాగంగా మండలంలోని కొత్తపల్లి కౌరుగుంట, అనంతవరం గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పురుషోత్తంతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. మరుగుదొడ్ల వినియోగాన్ని పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి ఎన్ గున్నయ్య పాల్గొన్నారు.

ఎడగారు రైతు దిగాలు

- తెరుచుకోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- మిల్లర్లతో కుమ్మక్కైన దళారులు
- భారీగా ధరలు తగ్గించి దోపిడీ
- శ్రమ ఫలితం కూడా దక్కడం లేదని రైతుల ఆవేదన



వర్షానికి వాలిన పంటను చూపిస్తున్న రైతు కొండయ్య



వర్షానికి నేల వాలిన పంటను కోస్తున్న వరికోత మెషీన్

అనుమసముద్రంపేట: ఎడగారు సాగుచేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఈ ఏడాది ఎరువుల కొరతతో పెట్టుబడులు పెరిగాయి. దీనికితోడు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో మిల్లర్లతో దళారులు కుమ్మక్కై భారీగా ధరలను తగ్గించి దోపిడీ చేస్తున్నారు. దీంతో శ్రమ ఫలితం కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది మండలంలోని రైతులు బోర్ల కింద సుమారు 500 ఎకరాల్లో ఎడగారు సాగుచేపట్టారు. ఆరుగాలం శ్రమించి పంట సాగు చేశారు. ఈ ఏడాది ఎరువుల కొరతతో పెట్టుబడులు భారీగా పెరిగాయి. దుక్కి, కూలీలు, ఎరువులు, పురుగు మందులు, తదితరాలకు ఎకరాకు సుమారు రూ.35 వేల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం పంట నూర్పిళ్లు చేపడుతున్నారు. ఇటీవల వర్షాలకు పంట నేలవాలడంతో వరికోత మెషీన్‌కు గంటకు రూ.2500 వరకు తీసుకుంటున్నారు. పొలాల్లో నుంచి ధాన్యాన్ని తరలించేందుకు కూలీలు, ట్రాక్టర్ ఖర్చులు కూడా కలుపుకొంటే ఎకరాకు సుమారు రూ.40వేల వరకు ఖర్చులు అయినట్లుగా రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పుట్టి రూ.20వేలకు పైగా అమ్ముకున్న రైతులు ఆదాయాన్ని పొందారు. ప్రస్తుత దళారులు పుట్టి ధాన్యాన్ని రూ.13500కు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో శ్రమ ఫలితం కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిలర్లు సిండికేట్‌గా మారడంతో..

గత ప్రభుత్వ హయాంలో మండలంలో దాదాపు 15వేల ఎకరాల్లో అధికారికంగా ధాన్యం పండించారు. పుట్టి రూ.20వేలకుపైగా పలుకుతూ ఆదాయం రావడంతో రైతులు సంతోషంగా సాగు చేపట్టారు. ప్రస్తుతం రెండు వేల ఎకరాల్లో కూడా రైతులు ధాన్యం పండించలేని పరిస్థితిలో ఉన్నారు. ఇందుకు కారణం మిల్లర్లు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించి నోట్లో మట్టి కొడుతుండడమే. కొనుగోలు కేంద్రాలను తెరిచి ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాటాల్లో సైతం మోసాలు

రైతులు కోసిన ధాన్యాన్ని కాటా వేసి ట్రాక్టర్లతో మిల్లుకు తరలిస్తే దాదాపు వేయి కేజీల వరకు తగ్గుతున్నాయి. ఇదేమని మిల్లర్‌ను ప్రశ్నిస్తే మీ కాటాలు సరిగా ఉండవని, మిల్లులోని కాటాలు ఖచ్చితంగా ఉంటాయని రైతులకు మోసపూరిత మాటలు చెబుతున్నారు. దీనికితోడు తరుగు పేరుతో బస్తాకు కేజీ నుంచి రెండు కేజీల వరకు తీసేస్తున్నారు. వర్షాల భయంతో రైతులు తప్పని పరిస్థితుల్లో మిల్లర్లు చెప్పిన ధరకు అమ్ముకుంటున్నారు.

ఆత్మహత్యలే శరణ్యం



ఈ ఏడాది ఐదెకరాలు కౌలుకు తీసుకొని ఎడగారు సాగుచేస్తే దిగుబడి బాగా వచ్చింది. కానీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో దళారులు అడిగిన ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడులు కూడా రాలేదు. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం.

– వేణుగోపాల్‌రెడ్డి, కౌలు రైతు, శ్రీకొలను

గిట్టుబాటు ధర లేదు



ఏడెకరాల్లో ఎడగారు చేశా. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు సైతం లేవు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరకపోవడంతో పండించిన పంటను నష్టానికి దళారులకు అమ్ముకోవాల్సి వచ్చింది.

– అంబవరపు రామిరెడ్డి, రైతు, శ్రీకొలను

నష్టపోయాం



తొమ్మిది ఎకరాల్లో వరి సాగుచేశా. దాదాపు రూ.4 లక్షలు పెట్టుబడులు అయ్యాయి. ధాన్యం ధరలు పతనమవడంతో పెట్టుబడులు రాకపోగా దాదాపు రూ.లక్ష నష్టం వచ్చింది. ప్రభుత్వం స్పందించి పంటలకు మద్దతు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలి.

–కల్లూరు కృష్ణారెడ్డి, రైతు, శ్రీకొలను

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం ఆదురుపల్లి 132కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ లిఖిత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం నేడు

సీతారామపురం : స్థానిక ఎస్సీ కాలనీలోని ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో సీతారామపురం చాంపియన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.8 వేలు నగదును వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య అందజేస్తారని చెప్పారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన జట్లు ఎంట్రీ ఫీజు రూ.500, బాల్‌ఫీజు రూ.100 చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 94942 86086, 99632 99050 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.340

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.340 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 485 బేళ్లను తీసుకురాగా 348 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 137 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకుకు గరిష్ఠంగా రూ.340, కనిష్ఠంగా రూ.85, సరాసరిన రూ.221.83 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

శక్తిస్వరూపిణి పాహిమాం



ఆత్మకూరులో గాయత్రిదేవిగా జ్వాలాముఖి



కలిగిరి: సరస్వతీదేవిగా భద్రకాళి



ఆత్మకూరులో బాలత్రిపురసుందరిగా దుర్గాదేవి

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాల్గో రోజు గురువారం అమ్మవారు విశేష రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కాశీనాయన ఆశ్రమంలో దుర్గాదేవి అమ్మవారు బాలత్రిపురసుందరి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో కాత్యాయనీగా భక్తులను కటాక్షించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో ధనలక్ష్మిగా సాక్షాత్కరించారు. ఉత్తరబలిజవీధిలోని జ్వాలాముఖి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులను అనుగ్రహించారు.

సీతారామపురం : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సిద్దేశ్వరంలో ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో అమ్మవారు కూష్మాండదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వరికుంటపాడులోని నాగర్పమ్మ ఆలయంలో కాత్యాయనీదేవి అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని సంతానలక్ష్మి ఆలయంలో అమ్మవారు వారాహీదేవిగా, పార్వతీ పరమేశ్వర ఆలయంలో కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో కాత్యాయనీదేవిగా అమ్మవారిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

కలిగిరి: తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు.



ఆత్మకూరులో కాత్యాయనీగా అన్నపూర్ణాదేవి



సంగంలో కాత్యాయనీగా కామాక్షిదేవి



ఉదయగిరిలో కాత్యాయనీగా పార్వతిదేవి



సీతారామపురం: అన్నపూర్ణగా ఇష్టకామేశ్వరీదేవి

మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పరామర్శ



ఆత్మకూరురూరల్: వెన్నవాడలో పర్వతరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న విక్రమ్‌రెడ్డి



సోమశిల: రమణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్/సోమశిల: ఆత్మకూరు, అనంతసాగరం మండలాలకు చెందిన పలువురిని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆత్మకూరు మండలం వెన్నవాడకు చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు పర్వతరెడ్డి బలరామిరెడ్డి ఇటీవల మరణించిన నేపథ్యంలో ఆయన కుమారులు మధుసూదన్‌రెడ్డి, వీరరాఘవుల కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే యర్రబల్లికి చెందిన ఉలవ వీరరాఘవులు కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించిన నేపథ్యంలో కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే అనంతసాగరం మండలం వరికుంటపాడులో జరిగిన ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు తిరుమలరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తల్లి రమణమ్మ ఉత్తరక్రియల్లో పాల్గొన్నారు. రమణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, అనంతసాగరం మండలాధ్యక్షుడు బిజివేముల పిచ్చిరెడ్డి, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మెట్టుకూరు సుబ్బారెడ్డి, ఏఎస్‌పేట ఎంపీపీ బోయిళ్ల పద్మజారెడ్డి, నాయకులు సిద్ధం శ్రీనివాసులు, నోటి వినయ్‌కుమార్, కొల్లి దొరస్వామి నాయుడు, వెంకటరమణయ్య, గోపవరం కాశిరెడ్డి, జగన్నాథం ప్రసాద్, దిశించర్ల ప్రసాద్, కోటంరెడ్డి సుబ్బారెడ్డి, గోపవరం కాశిరెడ్డి, ధనాల రమేష్‌నాయుడు, మహంత్‌రెడ్డి, సర్పంచ్‌లు బొలిగర్ల వెంకటేశ్వర్లు, సూరం ప్రసాద్‌రెడ్డి, చెలిక రమాహరిబాబు, చవల శ్రీనివాసులు, ఎద్దుల వెంకటేశ్వర్లురెడ్డి, సిద్దన పెంచలరెడ్డి, చింతగుంట రామిరెడ్డి, ముక్కు మస్తాన్‌గౌడ్, జీ కృష్ణయ్య, ఈశ్వరయ్య, హరీష్, పాపరెడ్డి తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఓ శ్రీనివాసులు

ఉదయగిరి రూరల్: రైతులకు పంట కోత ప్రయోగంపై క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించాలని మండల సహాయ గణాంక అధికారి శ్రీనివాసులు సూచించారు. మండలంలోని రైతుసేవా కేంద్రాల్లోని వీఏఏలు, వీహెచ్ఏలకు పంట కోత ప్రయోగంపై మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌తో కలిసి గురువారం ఆయన అవగాహన కల్పించారు. పంట కోత ప్రయోగంతో దిగుబడులను ముందుగా అంచనా వేయవచ్చని తెలిపారు. పంట కోత ప్రయోగం ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. రైతుల పొలాల్లో ముందుగా సూచించిన కొలతల ప్రకారం పంట కోత ప్రయోగం చేపట్టాలన్నారు.

పంచాయతీ స్థల వివాదంపై విచారణ

కొండాపురం: మండలంలోని మర్రిగుంటలో పంచాయతీ స్థలం వివాదంపై డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం విచారణ చేపట్టారు. పంచాయతీ స్థలాన్ని ఆక్రమించారని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రెండ్రోజుల క్రితం ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపీడీఓ గ్రామానికి చేరుకుని పంచాయతీ స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీకి చెందిన చిట్టాబత్తిన శ్రీనివాసులు మాట్లాడుతూ తాము 1997లో ఇల్లు నిర్మించుకున్నామని, 2004లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కావాలని తమ ఇళ్లకు అడ్డుగా పంచాయతీ భవనాన్ని నిర్మించారని తెలిపారు. అప్పట్లో పంచాయతీ భవనం పక్కనున్న ఖాళీ స్థలంలో తమకు దారి కేటాయించారని , అప్పట్నుంచి ఆ దారిలోనే నడుస్తున్నామన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలబడడంతో గులక తోలుకున్నామన్నారు. అయితే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కొందరు తమను ఇబ్బంది పెట్టేందుకు పంచాయతీ స్థలాన్ని ఆక్రమించినట్లుగా ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారన్నారు. తాము ఎలాంటి పంచాయతీ స్థలాన్ని ఆక్రమించలేదని, తాము ఎప్పట్నుంచో నడుస్తున్న దారిలోనే గులక తోలుకున్నామని తెలిపారు. గ్రామంలోని చాలామంది గ్రామ కంఠం భూములను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్నారని, తాము ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని, తాము నడిచే దారిలోనే గులక తోలుకున్నామని, తమను ఇబ్బంది పెట్టేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్యకళాశాలలను ప్రైవేట్ పరం చేయొద్దు



ఆర్డీఓ పావనికి వినతి పత్రం ఇస్తున్న జేవీవీ, ప్రజాసంఘాల నాయకులు

ఆత్మకూరురూరల్: వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆత్మకూరు జనవిజ్ఞాన వేదిక, ప్రజాసంఘాల నాయకులు ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావనికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యకళాశాలలను ప్రైవేట్ పరం చేయడం వల్ల సామాన్య ప్రజలు, పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే సేవా భావం ఉన్న పేద , మధ్యతరగతి విద్యార్థులు వైద్యవిద్యకు దూరమవుతారన్నారు. దీంతో పేదలకు వైద్యం గగనం అవుతుందన్నారు. వైద్యకళాశాలలను పీపీపీ పద్ధతిలో కాకుండా ప్రభుత్వమే నిర్వహించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. జేవీవీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున, నాయకులు సందానీ, సాధిక్ హుస్సేన్, షేక్ సందానీ, ముజీబ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాల్‌కు నివాళి



ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఎంజీఆర్ బస్‌స్టేషన్ వద్ద భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు దీన్‌దయాల్ ప్రధానోపాధ్యాయ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. దీన్‌దయాల్ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, కే సుధాకర్, నున్నా సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

సీతారామపురం : అయ్యవారిపల్లిలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు.

ఆస్పత్రికి వెళ్లొచ్చేలోగా ఇంట్లో చోరీ



సోమశిల: అనంతసాగరం మండలం మినగల్లు బీసీ కాలనీలోని ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి నగదు, బంగారం అపహరించుకెళ్లిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు..మినగల్లు బీసీ కాలనీకి చెందిన అగ్నిగుండాల మస్తానమ్మ మూడ్రోజుల క్రితం అనారోగ్యంతో ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లింది. గురువారం తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులోని బంగారు చైన్, జత కమ్మలు (నాలుగు సవర్లు), రూ.50వేలు నగదు కనిపించలేదు. దీంతో అనంతసాగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించనున్నట్లు పోలీసులు తెలిపారు.